


# మారుతికి గట్టి షాక్

## 40 శాతం దిగువకు పడిపోయిన మార్కెట్ వాటా

న్యూఢిల్లీ, మే 5: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీకి గట్టి షాక్ తగిలింది. దేశీయ ప్యాసింజర్ కార్ల మార్కెట్లో అగ్రస్థాయిలో దూసుకుపోయిన కంపెనీకి బ్రేక్‌లు పడ్డాయి. సంస్థకు మహీంద్రా అండ్ మహీంద్రా, హ్యుందాయ్ మోటర్‌ల నుంచి పోటీ తీవ్రతరమవుతుండటంతో కంపెనీ మార్కెట్ వాటా ఏటేటా పడిపోతున్నది. ఇదే క్రమంలో గత నెలలో 40 శాతం దిగువకు పడిపోయిందని దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(ఫాడా) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. రెండో స్థానానికి మహీంద్రా ఎగబాకింది. ఈ స్థానంలో ఉన్న హ్యుందాయ్ 12.47 శాతం మార్కెట్ వాటాతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. అలాగే టాటా మోటర్స్ 12.59 శాతం మార్కెట్‌తో మూడో స్థానంలో కొనసాగుతున్నది. గడిచిన నెలలో దేశీయంగా 3,49,939 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో అమ్ముడైన 3,44,594 యూనిట్లతో పోలిస్తే 1.55 శాతం అధికం. వీటిలో మారుతి సుజుకీ 1,38,021 యూనిట్ల పీవీలను విక్రయించింది. ఏప్రిల్ నెలలో మహీంద్రా అండ్ మహీంద్రా 48,405 యూనిట్ల వాహనాలను విక్రయించింది. కంపెనీకి చెందిన ఎస్‌యూవీలకు మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉండటంతో 13.83 శాతం వాటాను దక్కించుకున్నది. అలాగే హ్యుందాయ్ మోటర్ 43,642 యూనిట్ల వాహనాలను విక్రయించి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది.

## మహీంద్రా ఈవీపై రూ.4 లక్షల డిస్కౌంట్



ముంబై, మే 5: మహీంద్రా అండ్ మహీంద్రా..దేశీయ మార్కెట్లోకి విడుదల చేసిన ఎలక్ట్రిక్ మాడల్ ఎక్స్‌ఈవీ 9ఈపై రూ.4 లక్షల వరకు డిస్కౌంట్‌ను అందిస్తున్నది. ఈ కారు 23 లక్షలనుంచి రూ.31 లక్షలలోపు లభించనున్నది. ఈ ధరలు ముంబై షోరూంకు సంబంధించినవి. తన పోటీ సంస్థయైన హ్యుందాయ్‌కి చెందిన ఐనోక్ 5 మాడల్‌పై ఇంతే స్థాయిలో డిస్కౌంట్ ప్రకటించడంతో మహీంద్రా ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఐపోక్ మాడల్ ధర రూ.48.78 లక్షలకు దిగొచ్చింది. ఈ ధరలు ముంబై షోరూంనకు సంబంధించినవి.

## నాలుగు నెలల గరిష్ఠానికి సూచీలు

ముంబై, మే 5: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడంతో సెన్సెక్స్ నాలుగు నెలల గరిష్ఠ స్థాయిని తాకింది. వరుసగా రెండు రోజులుగా పెరుగుతూ వచ్చిన సూచీలు సోమవారం కూడా మరింత పెరిగాయి. ఇంట్రాడేలో 500 పాయింట్లకు పైగా లాభపడి 81 వేల పాయింట్ల పైకి చేరుకున్న సెన్సెక్స్..మార్కెట్ ముగిసే సమయానికి 294.85 పాయింట్లు అందుకొని 80,796.84 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 114.45 పాయింట్లు ఎగబాకి 24,461.15 వద్ద స్థిరపడింది. ఇరు సూచీలు 2025 గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి.

- అదానీ పోర్ట్స్ షేరు అత్యధికంగా 6.29 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు అదానీ గ్రూపు షేరైన అదానీ పోర్ట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీలు లాభాల్లో ముగిశాయి.
- వీటితోపాటు బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా, పవర్‌గ్రిడ్, ఐటీసీ, టాటా మోటర్స్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌యూఎల్ షేర్లు లాభపడ్డాయి.

# ఇక రుణాలు చౌకే!

## భారీగా తగ్గనున్న వడ్డీరేట్లు

### ఈ ఆర్థిక సంవత్సరం 150 బేసిస్ పాయింట్లు దిగిరావచ్చు




**రాబోయే ఆర్బీఐ ద్రవ్య సమీక్షల్లో రెపో కోతలు**

న్యూఢిల్లీ, మే 5: రుణగ్రహీతలకు శుభవార్త. గృహ, వాహన, వ్యక్తిగత తదితర లోన్లపై వడ్డీరేట్లు తగ్గబోతున్నాయన్న సంకేతాలను ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో రెపోరేటును 125 నుంచి 150 బేసిస్ పాయింట్ల దాకా తగ్గించే వీలుందని సోమవారం ఎస్బీఐ రిసెర్చ్ ఓ నివేదికను విడుదల చేసింది. ఇదే జరిగితే ఆ మేరకు ఆయా బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు కూడా కస్టమర్లకు తక్కువ వడ్డీకే అప్పులివ్వనున్నాయి. అలాగే ఇప్పటికే తీసుకున్న రుణాలపైనా వడ్డీరేట్లు తగ్గి, ఈఎంఐ భారం దిగొచ్చే వీలున్నది.



**దిగొస్తున్న ద్రవ్యోల్బణం**

హోల్‌సేల్, రిటైల్ ద్రవ్యోల్బణం శాంతిస్తుండటంతో ఇన్నాళ్లూ కఠిన ద్రవ్య వైఖరిని అనుసరించిన ఆర్బీఐ.. ఇప్పుడు వడ్డీరేట్లను తగ్గిస్తూపోతున్నది. గత రెండు ద్రవ్యసమీక్షల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున 50 బేసిస్ పాయింట్లు తగ్గిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో రాబోయే ద్రవ్యసమీక్షల్లోనూ మరిన్ని కోతలుంటాయంటున్న ఎస్బీఐ.. 'జంబో' రేట్ కటింగ్స్‌కూ చాన్స్ ఉందని, ఒకేసారి 50 బేసిస్ పాయింట్లు తగ్గవచ్చని కూడా చెప్తుండటం గమనార్హం. ఆహారోత్పత్తుల ధరలు శాంతించడంతో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం మార్చి నెలలో 67 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.34 శాతానికే పరిమితమైంది. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నామినల్ జీడీపీ వృద్ధిరేటు 9-9.5 శాతంగా ఉంటుందన్న అంచనాలు సైతం వడ్డీరేట్ల కోతలకు ఉత్సాహాన్నిస్తున్నదని 'ఇన్‌ఫ్లేషన్ అండ్ రేట్ కట్ ట్రాజెక్టరీ' పేరిట ఎస్బీఐ ఆర్థిక పరిశోధన విభాగం నుంచి వచ్చిన రిపోర్టులో పేర్కొన్నారు.

**రూపీ 85-87 శ్రేణిలో..**

డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ ఏడాది 85-87 శ్రేణిలో ఉండవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా రూపీ తీవ్ర ఒడిదొడుకులనే ఎదుర్కొన్నది. అయితే ఇటీవలికాలంలో భారీగా పుంజుకున్నది. దీంతో 85 స్థాయికి దిగువనే మారకపు విలువ ఉన్నది. అయితే తాజా అంచనా దృష్ట్యా రాబోయే రోజుల్లో రూపాయికి మళ్లీ కష్టాలు తప్పవనిపిస్తున్నది.

**బీవోబీ వడ్డీరేట్ల తగ్గింపు**

బీవోబీ కీలక నిర్ణయం తీసుకున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును అరశాతం వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. రూ.3 కోట్లలోపు ఎంపిక చేసిన కాలపరిమితులపై మాత్రం ఈ తగ్గింపు రేట్లు వర్తించనున్నాయని పేర్కొంది. ఈ నూతన రేట్లు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని తెలిపింది. దీంతో ఏడు రోజుల నుంచి 10 ఏండ్లలోపు కాలపరిమితి కలిగిన ఎఫ్‌డీలపై వడ్డీరేటు 4 శాతం నుంచి 7.10 శాతం మధ్యలోకి దిగొచ్చాయి. అలాగే సీనియర్ సిటిజన్లకు 4.50 శాతం నుంచి 7.60 శాతం లోపు వడ్డీరేట్లను చెల్లిస్తున్నది బ్యాంక్.

## ఎఫ్‌టీసీసీఐ అవార్డుల గడువు పొడిగింపు

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఎఫ్‌టీసీసీఐ) తమ వార్షిక ఎక్సలెన్స్ అవార్డులు-2025 కోసం దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించింది. మొదట ప్రకటించిన ప్రకారం దరఖాస్తులకు ఈ నెల 10తో గడువు ముగుస్తుండగా, పలువురు పారిశ్రామికవేత్తల విజ్ఞప్తిమేరకు గడువు పొడిగించినట్లు ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు సురేశ్ కుమార్ సింఘాల్ తెలిపారు.

## ఎంటీఎన్‌ఎల్ డిఫాల్ట్

న్యూఢిల్లీ, మే 5: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికం సంస్థ ఎంటీఎన్‌ఎల్.. సార్వభౌమ హామీ కలిగిన రూ.6,109.6 కోట్ల బాండ్లకు సంబంధించి వడ్డీ చెల్లింపుల్లో విఫలమైంది. ఈ మేరకు ఆ సంస్థే రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొన్నది. ఎంటీఎన్‌ఎల్ గతంలో రూ.5,000 కోట్ల విలువైన ప్రభుత్వ హామీ, అన్‌సెక్యూర్డ్, రేటెడ్, లిస్టెడ్, రిడీమబుల్, నాన్-కన్వర్టబుల్, ట్యాక్సబుల్ బాండ్లను జారీ చేసింది. వీటికి సంబంధించే వడ్డీలను చెల్లించలేక చేతులెత్తేసింది.

# ఈ ఏడాదే ఐడీబీఐని అమ్మేస్తాం

- ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం నాగరాజు
- కొనేందుకు పోటీపడుతున్న కొటక్ మహీంద్రా బ్యాంక్?






న్యూఢిల్లీ, మే 5: ఐడీబీఐ బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వాటాను ఈ ఏడాదే అమ్మేస్తామని ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం నాగరాజు స్పష్టం చేశారు. సోమవారం జరిగిన తొలి రెసిడెన్షియల్ మార్ట్‌గేజ్ బ్యాక్డ్ సెక్యూరిటీస్ లిస్టింగ్ వేడుకలో పాల్గొన్న ఆయన ఐడీబీఐ విక్రయంపై మాట్లాడారు. ఈ క్రమంలోనే ప్రముఖ జాతీయ మీడియా సంస్థ మనీకంట్రోల్‌తో పైవిధంగా స్పందించారు. కాగా, దాదాపు నెల రోజుల క్రితం పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) కార్యదర్శి అరుణిష్ చావ్లా మాట్లాడుతూ.. ఐడీబీఐని అమ్మేసే ప్రక్రియ కొనసాగుతున్నదని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఐడీబీఐ బ్యాంక్‌ను కొనేందుకు ఆసక్తి ఉన్నవారు బిడ్లను దాఖలు చేయగా, వాటిలో కొన్నింటిని ఎంపిక చేసినట్టూ తెలుస్తున్నది. దీని ప్రకారం కొటక్ మహీంద్రా బ్యాంక్, ఫెయిర్‌ఫాక్స్, ఎమిరేట్స్ ఎన్‌బీడీ, ఓక్‌ట్రీ క్యాపిటల్ వంటివి ముందు వరుసలో ఉన్నట్టు చెప్తున్నారు. కాగా, బ్యాంక్‌కున్న రుణగ్రహీతలు, మొండి బకాయిలు ఇతరత్రా వివరాలన్నింటినీ సమీక్షిస్తున్నట్టు సమాచారం.

**95 శాతం వాటా**

ఐడీబీఐ బ్యాంక్‌లో ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసీ)కు మెజారిటీ వాటా ఉన్నదిప్పుడు. కేంద్ర ప్రభుత్వానికి ఉన్న వాటాతో కలిపితే ఇది 95 శాతంగా ఉంటున్నది. అయితే ఇందులో 60.72 శాతం వాటాను అమ్మేందుకు అటు కేంద్రం, ఇటు ఎల్‌ఐసీ యోచిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి ఉన్న మొత్తం 30.48 శాతం వాటాతోపాటు ఎల్‌ఐసీ వాటాలో మరో 30.24 శాతం వాటాను విక్రయానికి పెట్టబోతున్నట్టు తెలుస్తున్నది. కాగా, ఐడీబీఐ ప్రైవేటీకరణ ప్లాన్‌ను మొదటిసారి 2021-22 బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అధిక మొండి బకాయిలు, మూలధన నిల్వల కొరత దృష్ట్యా ఎల్‌ఐసీ ద్వారా వాటాలను కొని బ్యాంక్‌లోకి కేంద్రం నిధులను చొప్పించిన సంగతి విదితమే. దీంతో ఐడీబీఐ ఎల్‌ఐసీ అనుబంధ సంస్థగా, ప్రైవేట్ బ్యాంక్‌గా మారిపోయింది. ఆ తర్వాత బ్యాంక్ ఆర్థికంగా బలపడింది. అయినప్పటికీ వాటాల విక్రయం మాత్రం సజావుగా సాగకపోవడం గమనార్హం. మొత్తానికి రెండేండ్లుగా ఐడీబీఐ అమ్మకానికి కేంద్రం తీవ్ర కసరత్తునే చేస్తున్నది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల ఉపసంహరణ ద్వారా రూ.47,000 కోట్లను సమీకరించాలని మోదీ సర్కారు యోచిస్తున్నది. ఇందులో ఐడీబీఐ వాటా విక్రయాలు కూడా ఉన్నాయి.



## 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసిన ఆర్బీఐ

ముంబై, మే 5: రిజర్వుబ్యాంక్ మరో 25 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో 25 టన్నుల గోల్డ్ రిజర్వులను పెంచుకున్నది. దీంతో సెంట్రల్ బ్యాంక్ వద్ద బంగారం నిల్వలు 879.59 టన్నులకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2024 నాటికి 854.73 టన్నుల గోల్డ్ నిల్వలు ఉండగా..ప్రస్తుతం 57 టన్నులను పెంచుకున్నది. గడిచిన ఏడేండ్లలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో కొనుగోలు చేయడం ఇదే తొలిసారి. ఒకవైపు పసిడి ధరలు రికార్డు స్థాయి లో పెరిగినప్పటికీ ఆర్బీఐ గోల్డ్‌ను కొనుగోలు చేయడం విశేషం. సెంట్రల్ బ్యాంక్ వద్ద ఉన్న బంగారం నిల్వల్లో 511.99 టన్నుల గోల్డ్‌ను స్థానికంగా నిల్వ చేయగా, మరో 348.62 టన్నులను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్(బీఐఎస్) వద్ద, డిపాజిట్ రూపంలో 18.98 టన్నులు ఉంచింది.

## 'నర్సింగ్ ఆఫీసర్' ఫలితాలు విడుదల

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 2,322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. మొత్తం 42,244 మంది నర్సులు దరఖాస్తు చేసుకోగా.. 40,423 మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులు సాధించిన మార్కుల వివరాలను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. https://mhsrb.telangana.gov.in/MHSRB/home.htm వెబ్‌సైట్‌లో మార్కులను అందుబాటులో ఉంచామని, అభ్యర్థులు తమ మార్కుల వివరాలను చెక్ చేసుకోవాలని మెడికల్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

## దేశానికి అండగా నిలుద్దాం

**మాజీ మేయర్ రవీందర్‌సింగ్**

కరీంనగర్ కార్పొరేషన్, మే 5 : ప్రస్తుతం యుద్ధ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దేశాన్ని ఆర్థికంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ సూచించారు. సోమవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిక్కులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణంలో దేశం యుద్ధం చేయడానికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా, దేశ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ప్రతి పౌరుడు తమకు తోచినంత ఆర్థికంగా అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు.

# ప్రపంచంలోనే అద్భుతం కాళేశ్వరం

- కాంగ్రెస్ సర్కార్‌కు చేతకాక బరాజ్‌లపై కుట్రలు
- మూడు పిల్లర్లు రిపేరు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం
- కేసీఆర్ సృష్టించిన ముద్రను చెరిపేసే ప్రయత్నాలు
- నిర్లక్ష్యం కొనసాగితే మళ్లీ జల సాధన ఉద్యమమే: సిరికొండ
- మేడిగడ్డ పిల్లర్ కుంగుబాటుపై అనుమానాలు : ప్రకాశ్
- 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. వాస్తవాలు'పై చర్చావేదిక



మాట్లాడుతున్న మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి. చిత్రంలో వీ ప్రకాశ్

జయశంకర్ భూపాలపల్లి, మే 5 (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్ : ప్రపంచంలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మిస్తే.. పాలన చేతకాని దద్దమ్మలు ప్రాజెక్టులను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. వాస్తవాలు'పై చర్చావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి సిరికొండతోపాటు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, సాగునీటి రంగ నిపుణులు వీరమల్ల ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో మళ్లీ సమైక్య పాలన గుర్తుకు వస్తున్నదని అన్నారు. చంద్రబాబుకు రేవంత్ ఏజెంట్ అనే విషయం ప్రజలందరికీ తెలుసని.. చంద్రబాబు, రేవంత్ సమష్టి ప్రయోజనం ఆంధ్రా అభివృద్ధి కోసమేనని స్పష్టంచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు పిల్లర్లను కాంగ్రెస్ సర్కార్ రిపేరు చేయలేని దుస్థితిలో ఉన్నదని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల ద్వారా రైతులకు నీళ్లు అందించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేయకుండా కేసీఆర్ మార్క్‌ను చెరిపేయాలనే ఏకైక లక్ష్యంతో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ప్రాజెక్టులపై ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే మళ్లీ జల సాధన ఉద్యమం ప్రారంభం కాక తప్పదని హెచ్చరించారు. ఊరూరా కాంగ్రెస్ కుట్రలపై చర్చ జరగాలని, ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, దుర్గం చిన్నయ్య, మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు శ్రీహర్షిణి, వసంత పాల్గొన్నారు.

**కుంగుబాటుపై అనుమానాలు : ప్రకాశ్**

మేడిగడ్డ బరాజ్‌లో పిల్లర్ కుంగుబాటుపై అనుమానాలున్నాయని సాగునీటి రంగ నిపుణులు వీ ప్రకాశ్ అన్నారు. మేడిగడ్డలోని 20వ పిల్లర్ చిన్నగా కుంగిందని, దీంతో పెద్ద శబ్దం వచ్చిందనే విషయం కాంగ్రెస్ నాయకులకు ముందే ఎలా తెలిసిందని, ఎన్నికలకు ముందే పిల్లర్ ఎందుకు కుంగిందని ప్రశ్నించారు. బరాజ్‌లో వచ్చిన భారీ శబ్దంపై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఏమైందని, విచారణ ఎంత వరకు వచ్చిందని, ఇదంతా కుట్రలో భాగమనే విషయం అవగతమవుతున్నదని అన్నారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు బాగానే ఉన్నాయని, ఎన్‌డీఎస్‌ఏ సైతం ఈ రెండు బరాజ్‌లు రిపేరు చేయాలని సూచించలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ మాత్రం మూడు బరాజ్‌లు కూలిపోయాయని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు.

**నిర్వీర్యానికి కుట్రలు : కొప్పుల ఈశ్వర్**

కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. బరాజ్ కుంగినప్పటికీ రిపేరు చేసే అవకాశం ఉన్నా రేవంత్ ప్రభుత్వం కావాలనే పక్కన పెట్టిందని విమర్శించారు. రూ.200 కోట్లతో తామే మరమ్మత్తు చేస్తామని ఎల్‌అండ్‌టీ సంస్థ ముందుకొచ్చినా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు.

**సుందిళ్ల ఎందుకు ఆపింద్రు : పుట్ట మధు**

మేడిగడ్డ బరాజ్‌లో ఒక పిల్లర్ కుంగితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను ఎందుకు పక్కన పెట్టారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. అన్నారం బరాజ్‌లో చిన్నచిన్న సీపేజ్‌లు వచ్చాయని, వాటికి ఏనాడో మరమ్మతులు చేశారని, సుందిళ్లలో ఎలాంటి సమస్యలు లేవని, ఎన్‌డీఎస్‌ఏ సైతం ఈ రెండు బరాజ్‌లకు క్లియరెన్స్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయినా వాటిని ఎందుకు పక్కన పెట్టారో ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి. చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ, ఎంపీలు రఘునందన్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

# అభివృద్ధికి సహకరిస్తాం

- రహదారులకు భూసేకరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి
- నేషనల్ హైవే-363ను ప్రారంభించిన కేంద్ర మంత్రి గడ్కరీ

కుమ్రంభీం ఆసిఫాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ)/రామచంద్రాపురం/గోల్నాక: తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. రహదారుల అభివృద్ధి కోసం పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. సోమవారం రాష్ట్రంలో పర్యటించిన నితిన్‌గడ్కరీ పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి పలు జాతీయ రహదారులు, ఫ్లైఓవర్లను ప్రారంభించారు. తొలుత కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న నితిన్‌గడ్కరీ.. మంచిర్యాల-ఆసిఫాబాద్ జిల్లాల మీదుగా మహారాష్ట్ర సరిహద్దు వరకు రూ.3,900 కోట్లతో నిర్మించిన నేషనల్ హైవే-363 నాలుగు వరుసల రహదారితోపాటు నిర్మల్-ఖానాపూర్ ఎన్‌హెచ్-61 రెండు వరుసల రహదారి, ఆదిలాబాద్ మీదుగా వెళ్తున్న నాగ్‌పూర్-హైదరాబాద్ నేషనల్ హైవే-44లో అండర్‌పాస్‌లు, జంక్షన్లను ప్రారంభించారు. అనంతరం బీహెచ్‌ఈఎల్ చౌరస్తా, ఆర్సీపురం డివిజన్‌లో నిర్మించిన ఫ్లైఓవర్లతోపాటు అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎంపీలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు


విశేష పత్రం
పార్ట్ II - సెక్షన్ 3 - సబ్ సెక్షన్ (ii)
రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)

PUB/0510

ప్రకటన

సికింద్రాబాద్, 02 మే, 2025

**S.O.1995(E)**- రైల్వేల చట్టం 1989లోని సెక్షన్ 2 యొక్క క్లాజ్ (7A) ద్వారా సంక్రమించిన అధికారాల్ని వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి వర్తింపుతో సదరు టేబుల్‌లో కాలమ్ (3)లో తెలిపిన రాష్ట్రంలో అమలు, నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు, టేబుల్ యొక్క కాలమ్ (2)లో తెలిపిన విధంగా స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్‌కు సంబంధించి భూ సేకరణ కొరకు సమర్థ ప్రాధికారి విధులను నిర్వర్తించేందుకు దిగువ టేబుల్‌లో కాలమ్ (5)లో తెలిపిన అధికారికి ఇందుమూలంగా అధికారం ఇచ్చినది.

టేబుల్

| క్ర. సం. | స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ | రాష్ట్రం | జిల్లా | భూ సేకరణ కొరకు సమర్థ ప్రాధికారి |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1. | వడియారం మరియు మాసాయిపేట్ రైల్వే స్టేషన్స్ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.228 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం. | తెలంగాణ | మెదక్ | రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్, తూప్రాన్ |

[File No. :Y/GS/LC 228/eGazette/2025/7A]
(ఎల్. సాంబశివ రావు)
చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్, గతిశక్తి/II/ సికింద్రాబాద్, దక్షిణ మధ్య రైల్వే

A0638


# త్రిసభ్య కమిటీ భేటీకి ఏపీ డుమ్మా

- తమ రాష్ట్రంలోనే పెట్టాలని మెలిక
- 10 తర్వాత నిర్వహించాలని లేఖ
- ఎటూ తేలని తాగు నీటివాటాలు
- డిమాండ్లను విన్నవించిన తెలంగాణ
- 10.26 టీఎంసీలు కావాలి
- ఏపీ నిలువరించాలని డిమాండ్

హైదరాబాద్, మే5 (నమస్తే తెలంగాణ): వేసవి తాగునీటి అవసరాలు, కృష్ణా నదీ జలాల వినియోగంపై ఆ నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) మెంబర్ సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన త్రిసభ్య కమిటీ సమావేశానికి ఏపీ డుమ్మా కొట్టింది. 10 తర్వాత ఏపీలోనే సమావేశాన్ని నిర్వహించాలని మెలికపెట్టింది. తెలంగాణ అధికారులు మాత్రం సమావేశానికి హాజరై రాష్ట్ర నీటి అవసరాలను మరోసారి బోర్డుకు నివేదించారు. సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటినిల్వలను ఏ రాష్ట్రం ఎంత మేరకు వినియోగించుకోవాలనేది కేఆర్‌ఎంబీ ఆధ్వర్యంలోని త్రిసభ్య కమిటీ నిర్ణయిస్తుంది. బోర్డు మెంబర్ సెక్రటరీ, ఇరు రాష్ట్రాల ఈఎన్సీ (ఇంజినీర్ ఇన్ చీఫ్)లతో కూడిన ఈ కమిటీ ఏటా సీజన్లవారీగా ఎప్పటికప్పుడు సమావేశాలను ఏర్పాటు చేస్తుంది. మే, జూన్, జూలై నెలల నీటివాటాలపై కేఆర్‌ఎంబీ మెంబర్ సెక్రటరీ సోమవారం జలసౌధలో త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తెలంగాణ ఈఎన్సీ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జూలై 31 వర కు కల్వకుర్తికి 300 క్యూసెక్కులు, హైదరాబాద్‌కు 750 క్యూసెక్కులు, ఖమ్మం జిల్లా తాగునీటి అవసరాల కోసం 300 క్యూసెక్కులు ఇవ్వాలని కోరారు. జూలై నెలాఖరు వరకు తెలంగాణ తాగునీటి అవసరాల కోసం 10.26 టీఎంసీలు అవసరమని తెలిపారు. ప్రస్తుతం రెండు రిజర్వాయర్లలో కలిపి 15 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని, అందులో 4.28 టీఎంసీలు ఆవిరి నష్టాలు, తెలంగాణ అవసరాలు పోగా మిగిలేది 0.55 టీఎంసీలేనని వివరించారు. సాగర్ నుంచి ఏపీ 510 క్యూసెక్కులు దిగువకు పంపింగ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని గతంలోనే ఏపీ చెప్పామని వెల్లడించారు. కేఆర్‌ఎంబీ ఆదేశాలు లేకుండా సాగర్ కుడికాల్వ రెగ్యులేటర్, ముచ్చుమర్రి నుంచి నీటిని వాడకుండా ఏపీని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సమర్పించారు.

**ఏపీలోనే సమావేశం ఏర్పాటు చేయాలి..**

తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడికాలువ ద్వారా 10 టీఎంసీలు ఇవ్వాలని ఇప్పటికే ఇండెంట్ పెట్టిన ఏపీ.. ఆ మేరకు జలాలను కూడా తరలిస్తున్నది. కానీ నీటివాటాలపై నిర్వహించిన సమావేశానికి మాత్రం డుమ్మా కొట్టింది. ఈ నెల 10 తర్వాత ఏర్పాటు చేయాలని, దాన్ని కూడా ఏపీలో నిర్వహించాలని కోరుతూ లేఖ రాసింది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కేఆర్‌ఎంబీ ఏపీలో ఉండాలని, సమావేశాలను కూడా అక్కడే నిర్వహించాలని త్రీమెన్ కమిటీలో చర్చకు వచ్చినట్టు తెలిసింది.

# 16న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశం

## గోదావరి-కావేరి అనుసంధానంపై చర్చ

హైదరాబాద్, మే 5 (నమస్తే తెలంగాణ) : గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చించేందుకు ఈ నెల 16న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఎన్‌డబ్ల్యూడీఏ(నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ) సమాలోచనలు చేస్తున్నది. ఈ మేరకు ఇప్పటికే కేంద్ర జల్‌శక్తిశాఖకు ప్రతిపాదనలు పంపినట్టు సమాచారం. గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి నదుల అనుసంధానంపై తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కర్ణాటక, మహారాష్ట్రతో ఎన్‌డబ్ల్యూడీఏ ఇప్పటికే పలుమార్లు సమావేశాలు నిర్వహించింది. ఆయా నదుల అనుసంధానానికి ప్రతిపాదనలు పెట్టడం, అభ్యంతరాలు లేవనెత్తడం కొనసాగుతున్నది. దీంతో కేంద్ర జల్‌శక్తిశాఖ రంగంలో దిగింది. గతంలోనే సమావేశం నిర్వహించి రాష్ట్రాలన్నీ ఎవరికి వారు ఎక్కువ వాటాలు అడిగితే నీళ్లు ఎక్కడి నుంచి తెచ్చిస్తారని, రాష్ట్రాలు కావాలనుకుంటే ఇంట్రా లింకింగ్‌కు(రాష్ట్రం లోపల చేపట్టే అనుసంధానం) కేంద్రం నుంచి సహకారం అందిస్తామని తేల్చి చెప్పింది. అందుకోసం అన్ని రాష్ట్రాల సెక్రటరీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేస్తామని వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర జల్‌శక్తిశాఖకు ప్రతిపానదలు పంపినట్టు తెలిసింది.

**కేంద్ర జల్‌శక్తిశాఖ సమావేశం వాయిదా..**

కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 అవార్డు అంశంపై రాష్ట్రాలతో కేంద్ర జల్‌శక్తి శాఖ ఈ నెల 7న నిర్వహించతలపెట్టిన సమావేశం వాయిదాపడింది. ఈ మేరకు రాష్ట్రాలకు సమాచారం అందించింది. తదుపరి సమావేశ తేదీన త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 అవార్డును 2010లో ప్రకటించగా, పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఏపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో అవార్డు ఇప్పటికీ అమలులోకి రాకుండాపోయింది. సుదీర్ఘంగా కోర్టు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో జలహక్కులను కోల్పోతున్నామని కర్ణాటక, మహారాష్ట్ర సైతం కోర్టును ఆశ్రయించాయి.